RNI: TELTEL12215

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు    జాతీయ తెలుగు దినపత్రిక



WANTED

ప్రభాత సూర్యుడు

www.prabhathasuryudu.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.

కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

prabhathasuryudueditor@gmail.com

https://youtube.com/@UstudioTV

94940 54338



RANGAREDDY EDITION : 01 VOLUME :151 EDITOR: CHERUKU UPENDAR, DATE : MONDAY 16 OCTOBER 2023 PAGES: 4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 151 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 16 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-




# బీఆర్ఎస్ మేనిఫెస్టోతో...

# వరాలజల్లు


## బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక విడుదల

## తెలంగాణ భవన్‌లో మేనిఫెస్టో ఆవిష్కరించిన కేసీఆర్

తెలంగాణ

బ్యూరో - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆసరా పెన్షన్లు, రైతుబంధు డబ్బుల పెంపుతో పాటు మహిళల కోసం ప్రత్యేక పథకాలను ప్రకటించారు. అర్హులైన మహిళలకు నెలనెలా భృతి అందిస్తామన్నా రు. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూడో సారి అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలను కొనసాగించడంతో పాటు పాత కొత్త హామీలను ఆరు నెలల్లోగా అమలు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం, దానిని పేదలకు పంచడ మనే విధానంలో మొదట్నుంచీ తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు.



గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ప్రస్తావించని అనేక అంశాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

## బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ముఖ్యాంశాలు ఇవే..!

### కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా

రాష్ట్రంలో ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు అందరికీ రైతు బీమా తరహాలోనే ఎలీస్ఐసీ ద్వారా రూ. 5లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. దీని ద్వారా దాదాపు 93లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందజేస్తామన్నారు.

### ఆసరా పెన్షన్ల పెంపు

ఆసరా పెన్షన్లను ఐదేండ్లలో రూ. 5వేల రూపాయల వరకు పెంచుతామని అన్నారు. మొదటి సంవత్సరం వెయ్యి పెంచుతామని, అంటే 3,016 రూపాయలకు పెరుగుతాయన్నారు. దివ్యాంగులకు పెన్షన్ ఈ మధ్యనే 4,016 రూపాయలకు పెంచామని, దశలవారీగా 6,016 రూపాయలకు పెంచుతామన్నారు.

### రైతుబంధు సాయం పెంపు

ప్రస్తుతం రైతుబంధు కింద ఇస్తున్న పంట పెట్టుబడి సాయం ఏటా ఎకరానికి 10 వేల రూపాయలు ఇస్తున్నామని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే రైతుబంధు సాయాన్ని మొదటి సంవత్సరం ఎకరానికి 12 వేలకు పెంచుతుందని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేండ్లలో రైతుబంధు సహాయాన్ని క్రమంగా పెంచుతూ.. గరిష్టంగా ఎకరానికి యేటా రూ.16 వేలకు పెంచుతామని హామీ ఇస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు పాలసీని యధావిధిగా కొనసాగిస్తామన్నారు.

### అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేల భృతి

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలందరికీ ప్రతినెలా రూ.3వేల జీవన భృతిని అందజేస్తామన్నారు.

### 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకం

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండరు అందిస్తామని చెప్పారు. జర్నలిస్టులకు కూడా రూ.400కే సిలిండర్ అందజేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు.



### ఆరోగ్యశ్రీ 15లక్షలకు పెంపు

5 లక్షల రూపాయల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని గరిష్టంగా 15 లక్షల రూపాయలకు పెచుతామన్నారు.

### పేదలకు ఇండ్ల స్థలాలు

రాష్ట్రంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు బీఆర్ఎస్ ఇండ్ల స్థలాలు సమకూరుస్తుందని హామీ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం అమలవుతున్న హౌసింగ్ పాలసీ అలాగే కొనసాగిస్తామన్నారు.

### బీపీఎల్ కార్డుదారులకు వారికి రూ.3 వేల భృతి

బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే బీపీఎల్ కార్డు కలిగి, అన్ని అర్హతలున్న మహిళలకు నెలకు రూ.3వేలు జీవన భృతిని అందజేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. సౌభాగ్యలక్ష్మీ పథకం కింద ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, అమ్మ ఒడి, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు.

### పేదల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్స్

అగ్రవర్ణ పేదల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామన్నారు.

### మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు

రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాల సమాఖ్యలన్నింటికీ సొంత భవనాలు నిర్మించి ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు.

### తెలంగాణ అన్న పూర్ణ పథకం

తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ అన్నపూర్ణ పథకం కింద వచ్చే ఏప్రిల్, మే నెలల నుంచి రేషన్ కార్డు హెూల్డర్లకు సన్నబియ్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే హాస్టళ్లలో చదువుతున్న పిల్లలకు, అంగన్వాడీ కేంద్రాలకు కూడా సన్న బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ఆకలి కేకలు లేవని, అన్నపూర్ణ రాష్ట్రంగా అవతరించిందన్నారు. వరి ధాన్యం పండించడంలో పంజాబ్ ను తెలంగాణ దాటిపోయిందన్నారు.













### ఉద్యోగుల సీపీఎస్ పై అధ్యయన కమిటీ

సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులు తమకు పూర్వమున్న పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరుతున్న నేపథ్యంలో దీనిపై అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీని నియమించి, నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇంకా అనాథలైన పిల్లల కోసం ప్రత్యేక పాలసీ తీసుకొస్తామని చెప్పారు. లంబాడీ తండాలను, గోండు గూడేలను పంచాయతీలుగా చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మరో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మిస్తామన్నారు.



# బీసీలకు 50 సీట్లు..?



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వచ్చే ఎన్నికల్లో బీసీల ఓట్లను రాబట్టుకోవడంపై బీజేపీ దృష్టి సారిస్తోంది. దాదాపు 48 సీట్లను బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని సంచలన నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఇటీవల రాష్ట్ర నేతలకు క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. బీజేపీ అంటేనే బీసీల పార్టీ అని, అందుకే బీసీ మార్క్ తో ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బీసీలకు ఇవ్వనన్ని సీట్లు కమలం పార్టీ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అందులో ముదిరాజ్ కులస్తులకే కనీసం ఐదుకు తగ్గకుండా సీట్లు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఇతర కులాల వారికీ ప్రాధాన్యం ఇస్తూ టికెట్లు కేటాయించాలని భావిస్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ రెడ్ల పార్టీగా, బీఆర్ఎస్ వెలమ, రెడ్ల పార్టీగా ముద్ర పడిన నేపథ్యంలో ఆ రెండు పార్టీలను దెబ్బకొట్టేలా బీసీ కార్డుతో బీజేపీ భారీ స్కెచ్ వేసుకుంది. వారికి బీసీ ఓటు బ్యాంకును దూరం చేసేలా ప్లాన్ చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే 115 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించగా అందులో 23 మంది బీసీలకు అవకాశం కల్పించారు. కాగా, బీసీ సామాజికవర్గంలో మొత్తం 136 కులాలుండగా అందులో కేవలం యాదవ, గౌడ, మున్నూరుకాపు, పద్మశాలి, గంగపుత్ర, వంజరి కులస్తులకు మాత్రమే టికెట్లు కేటాయించింది. అత్యధిక శాతం జనాభా ఉన్న ముదిరాజ్ లకు ఒక్కటంటే ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. దీనిపై ఆ సామాజికవర్గం నేతలు గుర్రుగా ఉన్నారు. పలువురు బీఆర్ఎస్ ను వీడేందుకు సైతం సిద్ధమవుతున్నారు. దీంతో వారిని చేర్చుకోవడంపై బీజేపీ కసరత్తును ముమ్మరం చేసింది.మరోవైపు కాంగ్రెస్ ఇప్పటివరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. రేపో మాపో ప్రకటించే అవకాశం ఉంది. ఆ పార్టీ మహా అయితే 25 నుంచి 30 సీట్లు బీసీలకు ఇచ్చే అవకాశముందన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఆ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తే బహుజనవాదాన్ని వినిపించిన వారిమవుతామని భావిస్తోంది. గతంలో కాషాయ పార్టీకి బ్రాహ్మణులు, ఆర్యవైశ్యుల పార్టీగా ముద్ర పడింది. కానీ మోదీ ప్రధాని అయ్యాక ఆ సీన్ మారింది. ఆయన బీసీ కావడంతో బీసీల పార్టీగా బీజేపీకి ముద్ర పడింది. బీసీలకు కేంద్రమంత్రి పదవులు దక్కడంతో అగ్ర కులాల పార్టీ అన్న ముద్ర క్రమంగా తగ్గింది. అందుకే బీసీలకు కనీసం 40కి తక్కువ కాకుండా, దాదాపు 48 సీట్ల వరకు ఉండాలని నిర్ణయం తీసుకుందని చర్చ జరుగుతోంది. ఈమేరకు బీఎల్ సంతోష్ సైతం నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే లిస్టును సిద్ధం చేయాలని రాష్ట్ర నాయకత్వానికి సూచనలు చేసినట్లు సమాచారం.తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు గాను ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు 19, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు 12 ఉన్నాయి. అవి పోగా మిగతా 88 సీట్లలో సగం కంటే ఎక్కువ సీట్లను బీసీలకు కేటాయించాలని బీజేపీ చూస్తోంది. ఇప్పటికే బీజేపీలో బీసీ నేతలకు ప్రియారిటీ ఇచ్చిన హైకమాండ్ వారి ఓటు బ్యాంకును రాబట్టుకునే దిశగా ఎన్నికలకు సిద్ధమవుతోంది. వచ్చే ఎన్నికల్లో బీసీలకు బీజేపీ ప్రియారిటీ కల్పించనుండటంతో రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ వద్దకు బీసీ నేతలు క్యూ కట్టారు. సెగ్మెంట్ల వారీగా తమ సామాజిక వర్గం నుంచి బలమైన నేతలంటూ పేర్లను ప్రతిపాదించారు.కేవలం ముదిరాజ్ సామాజికవర్గానికి చెందినవారే దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 37 మంది పేర్లతో కూడిన జాబితాను ప్రకాశ్ జవదేకర్ కు ప్రతిపాదనలు చేయడం గమనార్హం. తమకు టికెట్లు కేటాయిస్తే తెలంగాణలో దాదాపు 20 సెగ్మెంట్లలో గెలుపు ఖాయమని పేర్కొన్నారు. అలాగే మరో 19 మంది నేతలకు జాతీయ, రాష్ట్ర, బాధ్యతలతో పాటు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రిప్రజెంటేషన్ ఇవ్వడం గమనార్హం.

## నేడు జనగామకు రానున్న సీఎం కేసీఆర్

### గులాబీ కండువా కప్పుకోనున్న పొన్నాల



**జనగామ- ప్రభాత సూర్యుడు :** నేడు జనగామ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ రానున్నారు. రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో బీఆర్ఎస్ పార్టీ ప్రచార పర్వానికి శంఖారావం పూరించారు. అందులో భాగంగానే జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపు కోసం సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణమవుతున్న గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ సభలో మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నట్టు తెలుస్తోంది. ఆయనతో పాటు మరికొంతమంది సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నట్టు సమాచారం. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, సీనియర్ నాయకులు జల్లి సిద్ధయ్య దగ్గరుండి చూస్తున్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని మంత్రులు, నాయకులు కోరుతున్నారు.

# ఆసక్తికరంగా రామగుండం రాజకీయాలు

## స్వతంత్ర అభ్యర్థిత్వపైనే మొగ్గు

అదిలాబాద్- ప్రభాత సూర్యుడు



అసెంబ్లీ ఎన్నికల వేళ రామగుండం రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉండటం కంటే? స్వతంత్రంగానే పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల యుద్ధం షురూ అయిపోయింది. ఆయా పార్టీలు తమ అభ్యర్థులు ఎవరా అనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఒక్కో నియోజకవర్గంలో ముగ్గురు నలుగురు ఆశావహులు టిక్కెట్ కోసం పోరాటం చేస్తుంటే?. రామగుండం నియోజకవర్గంలో మాత్రం పార్టీ టికెట్ ఖరారు చేస్తామన్నా...ఇండిపెండెంట్ గానే బరిలో నిలుచోవడానికి ఆయా పార్టీల నాయకులు పార్టీలు వీడుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా ఉంటోంది. 2009 ఎన్నికల్లో టీడీపీ,కాంగ్రెస్ హవా నడుస్తున్న తరుణంలో ఇరు పార్టీల టికెట్ కాదని? సోమారపు సత్యనారాయణ ఇండిపెండెంట్ గా బరిలో నిలిచి విజయం సాధించారు. 2014 లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఘన విజయం సాధించినప్పటికి 2018లో సత్యనారాయణ పై రెబెల్ గా పోటీచేసి కోరుకంటి చందర్ విజయం సాధించారు. ప్రస్తుత తరుణంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కోరుకంటి చందర్ ను అభ్యర్థిగా ప్రకటించగా? కాంగ్రెస్ పార్టీ నుండి మక్కాన్ సింగ్ బరిలో ఉండే అవకాశం ఉంది. భారతీయ జనతా పార్టీకి గత నాలుగు సంవత్సరాలుగా పెద్దదిక్కుగా ఉన్న సోమారపు సత్యనారాయణ అనూహ్య పరిణామాల మధ్య పార్టీకి రాజీనామా చేయడం ఇండిపెండెంట్ గా బరిలో నిలవనున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం నియోజకవర్గంపై ఆదినుంచి ఆశలు పెంచుకున్న బీజేపీకి ప్రస్తుతం అభ్యర్థి లేకపోవడంతో ఆ పార్టీవర్గాలు కలవరపడే పరిస్థితి నెలకుంది. కార్మిక క్షేత్రమైన రామగుండం నుంచి ఈ సారి ఎలాగైనా విజయం సాధించాలని బీజేపీ ఆసలు పెట్టుకుంది.. ఈ నియోజకవర్గం నుండి బీజేపీ పార్టీకి పెద్దన్న పాత్ర పోషించిన సోమారపుసత్యనారాయణతో పాటు కౌశిక్ హరి కూడా అసెంబ్లీ టికెట్ కు పోటీపడ్డారు. ఎవరికి వారు తమ వంతుగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తు ప్రజలతో మమేకమయ్యారు. బీజేపీ,బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ అని అందరు భావించిన నేపథ్యంలో నాయకులు పార్టీని వీడడంతో బీజేపీ చతికిల పడే పరిస్థితి నెలకొంది. కౌశికహరి బీజేపీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ లో చేరగా సోమారపు సత్యనారాయణ బీజేపీని వీడి ఇండిపెండెంట్‌గానే బరిలో నిలవడానికి సిద్ధమయ్యారు. రోజుకో మాట, వాగ్దానాలు చేసే పార్టీల మాటలకంటే ఇండిపెండెంట్ గా ఉండే నాయకులే తమకు అవసరమనే ధోరణిలో రామ గుండం నియోజకవర్గ ప్రజలు ఆది నుండి స్వతంత్ర అభ్యర్థులకే పట్టం కడుతున్నారు. పార్టీల్లో ఉండి ఓడిపోయిన సానుభూతి,అన్ని పార్టీల నాయ కులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో సహాకారం అందిం చడం, మతాలకు, కులాలకు అతీతంగా ఓటు బ్యాంకు పెరగడం లాంటి అంశాలు ఈ నియోజక వర్గంలో కలిసి వస్తున్న అంశాలు కావడంతో స్వతంత్ర అభ్య ర్థులుగానే బరిలో నిలవడానికి మొగ్గు చూపుతున్నారు నేతలు. ఇటీవలే బీఆర్ ఎస్ పార్టీ ని వీడిన కందుల సంధ్యారాణి, బీజేపీ పార్టీని వీడిన సోమారపు సత్యనారాయణతో పాటు పలువురు కార్మిక నాయకులు కూడా పార్టీలకతీతంగా ఇండిపెండెంట్‌గా బరిలో నిలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఖమ్మంలో కారు డ్యామేజ్..!

- పొంగులేటి, తుమ్మల ఆకస్మిక ఆపరేషన్ -ఒక్కొక్కరిగా బీఆర్ఎస్‌ను వీడుతున్న నేతలు
- మాజీ ఎమ్మెల్సీ బాలసానితో సహా నలుగురు కార్పొరేటర్లు, ముఖ్య నాయకుల బైబై
- పార్టీ వీడొద్దని ఆఫర్లు ప్రకటించిన కేటీఆర్, పల్లా.. అయినా వినని నేతలు
- రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక - మరికొందరు వీడకుండా మంత్రి పువ్వాడ ఆకస్మిక సమావేశం

ఖమ్మం- - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీఫామ్‌లు ఇచ్చేందుకు అభ్యర్థులతో సమావేశమైన రోజే ఖమ్మంలో 'కారు'కు భారీ డ్యామేజ్ జరిగింది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఆదివారం పొలిటికల్ స్టింగ్ ఆపరేషన్ కొనసాగింది. బీఆర్ఎస్ నేతలు వన్ బై వన్ అన్నట్టుగా కాంగ్రెస్ గూటికి చేరారు. బీఫామ్ తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లిన మంత్రి పువ్వాడ అజరుకుమార్‌కు ఈ విషయం తెలిసి ఆగమేఘాల మీద బయలుదేరి ఖమ్మం విచ్చేశారు. మరికొందరు 'చే'జారకుండా ఆకస్మిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈలోగానే మాజీ ఎమ్మెల్సీ, డీసీసీబీ మాజీ చైర్మెన్ బాలసాని లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మాజీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ కమర్తపు మురళి, కార్పొరేటర్లు చావా మాధురి, రావూరి కరుణ, పోట్ల శశికళ భర్తలు చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, పోట్ల వీరేందర్, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు సంక్రాంతి నాగేశ్వరరావు, ఏలూరి శ్రీనివాస్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు కాంగ్రెస్‌లో చేరేందుకు సముఖత వ్యక్తం చేశారు. పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరందరూ కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. అనంతరం వీరందరినీ తోడ్కొని తుమ్మల, పొంగులేటి హైదరాబాద్ పయనమయ్యారు. గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ మొదటి జాబితా ప్రకటించిన రోజే ఖమ్మం 'కారు'లో ప్రకంపనలు చోటుచేసుకోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపగా.. బీఆర్ఎస్‌కు మాత్రం ఇది మింగుడు పడని అంశమేనని విమర్శకుల మాట.

**నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశంను..**

**అత్యధిక మెజార్టీతో గెలిపించండి**

నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ అధిష్టానం నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంను ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. నకిరేకల్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో వారు వీరేశంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంతృత్వ పాలనకు చెక్ పెట్టాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో నకిరేకల్ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. వన్ బై వన్ నేతలు పార్టీ వీడుతున్నారని తెలిసిన వెంటనే మంత్రి పువ్వాడ అప్రమత్తమయ్యారు. ఆగమేఘాల మీద హైదరాబాద్ నుంచి వచ్చి ఆకస్మిక సమావేశం ఏర్పాటు చేశారు. అసంతృప్త నేతలు, కార్పొరేటర్లను బుజ్జగించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ ఆపరేషన్ కొనసాగుతున్న సమయంలో మంత్రి స్థానికంగా లేకపోవడంతో ఆయన పీఏ రవికిరణ్‌ను ఓ కార్పొరేటర్ ఇంటికి పంపించి నచ్చజెప్పారని, మరో ముఖ్య నాయకున్ని మమత ఆస్పత్రిలోని మంత్రి ఇంటికి పిలిపించి బుజ్జగించారని సమాచారం. ఇంకా సుమారు ఏడెనిమిది కార్పొరేటర్లు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇంకా పలువురు 'హస్తం' గూటికి చేరతారని, ఆట ఇప్పుడే మొదలైందని పొంగులేటి, తుమ్మల ప్రకటించడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. కేటీఆర్ ఫోన్.. పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఇద్దరికి ఆఫర్..

మొదటి నుంచి మాజీ మంత్రి అనుచరునిగా ఉన్న బాలసాని లక్ష్మీనారాయణ తుమ్మల మంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. పువ్వాడ అజరుకుమార్ మంత్రయ్యాక జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాలసానికి కాకుండా తాతా మధుసూదన్‌కు బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. అప్పటి నుంచి పార్టీలో కాస్తంత అసౌకర్యంగానే బాలసాని ఉంటున్నారు. ఈ క్రమంలో బాలసానిని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా పార్టీ నియమించింది. ఆ తర్వాత పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావును తిరిగి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనకు తెలియకుండా వెంకట్రావును తిరిగి పార్టీలో చేర్చుకోవడమే కాకుండా భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగానూ ప్రకటించారు. ఇటీవల ప్రకటించిన నియోజకవర్గ ఇన్‌చార్జుల జాబితాలో భద్రాచలం బాధ్యతల నుంచి బాలసానిని తప్పించిఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు అప్పగించారు. ఈ పరిణామాలన్నీ బాలసానిని కలిచివేశాయి. దీనికితోడు తన రాజకీయ గురువు తుమ్మల సైతం కాంగ్రెస్‌లో చేరడంతో తాను కూడా ఆయన చెంతకు చేరాలని నిర్ణయించుకున్నారు. ఈలోగా మంత్రి పువ్వాడ రెండు పర్యాయాలు, మంత్రితో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఖమ్మంలోని బాలసాని ఇంటికి వెళ్లి నచ్చజెప్పారు. కేటీఆర్ ఫోన్ చేసి జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. మరోవైపు నగర పార్టీ మాజీ అధ్యక్షులు కమర్తపు మురళికి కూడా ఆదివారం ఫోన్ చేసి కేటీఆర్ ఇదే రకమైన హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఆ సమయంలో బాలసాని, మురళి ఒకేచోట తుమ్మల, పొంగులేటితో పాటు ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇక ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి సైతం కమర్తపు మురళికి ఫోన్ చేసి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వీరు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసే అవకాశం కాంగ్రెస్‌లో ఉండటంతోనే ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు విలేకరుల సమావేశంలో తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

# షర్మిల.. కోలుకోలేని ఎఫెక్ట్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ ఒక్కోసారి తీసుకుంటున్న నిర్ణయం ఆ పార్టీకి కొంత శాపంగా మారుతుంది. ఈసారి షర్మిల రూపంలో కొంత దెబ్బతినే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకు కండువాలు కప్పేస్తున్న పార్టీ హైకమాండ్ వైఎస్ తనయ షర్మిల విషయంలో మాత్రం ఆలోచించింది. అదే ఇప్పుడు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తానన్న షర్మిల ప్రతిపాదనకు హైకమాండ్ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఆమె 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతుంది. అయితే అన్ని నియోజకవర్గాల్లో షర్మిల ప్రభావం ఉంటుందా? అంటే చెప్పలేం కాని... ఆమె పోటీ చేసే పాలేరులో మాత్రం ఖచ్చితంగా కొంత ప్రభావం చూపే అవకాశముందని చెబుతున్నారు. షర్మిల తాను తొలి నుంచి పాలేరు నియోజకవర్గంలోనే పోటీ చేస్తానని ప్రకటించారు. అక్కడ సొంత పార్టీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. పాలేరులో రెడ్డి సామాజికవర్గం అధికంగా ఉండటంతో పాటు వైఎస్ అభిమానుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతోనే ఆమె పాలేరును ఎంచుకున్నారన్న సంగతి ప్రతి ఒక్కరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు పాలేరు నుంచి తాను పోటీ చేయనున్నట్లు షర్మిల ప్రకటించడంతో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి ఇబ్బందులు తప్పేట్లు లేవు. పాలేరు నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బరిలోకి దిగాలని ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఆయన పార్టీ మారి మరీ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉపేందర్ రెడ్డి చేతిలోనే తుమ్మల నాగేశ్వరరావు ఓటమి పాలయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఒక ప్రధాన సామాజికవర్గం తుమ్మల వైపు నిలిచే అవకాశం లేదంటున్నారు. అదే సమయంలో షర్మిల కూడా భారీగా ఓట్లు చీల్చుకునే అవకాశముందని, ఇది కాంగ్రెస్ పార్టీకే నష్టమన్న అంచనాలు మాత్రం వినపడుతున్నాయి. షర్మిల పోటీ చేస్తే తుమ్మల విజయానికి ఇబ్బంది ఏర్పడటం ఖాయమన్నది పరిశీలకులు సయితం అంగీకరిస్తున్న విషయం. అదే వైఎస్సార్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకుని ఉంటే పాలేరు ఖచ్చితంగా కాంగ్రెస్ ఖాతాలో పడేదని, ఇప్పుడు మాత్రం శ్రమించకతప్పదని అంటున్నారు. షర్మిల నిర్ణయంతో పాలేరులో కారు పార్టీ అభ్యర్థి నెత్తిన పాలు పోసినట్లేనన్న కామెంట్స్



వినపడుతున్నాయి. మరో వైపు షర్మిల విజయావకాశాలను కూడా కొట్టిపారేయలేం అని చెబుతున్నారు. మరి వైఎస్ షర్మిల ఏ మేరకు ఓట్లు చీల్చి ఎవరికి నష్టం కలిగిస్తారు? అన్నది డిసెంబరు 3న తేలనుంది.

**కలిసి రాని కాలం**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయగా వైఎస్ షర్మిలకు రాజకీయాలు అస్సలు అచ్చిరాలేదనే చెప్పాలి. ఏపీలో తన అన్నను కాదని తెలంగాణలో పార్టీ పెట్టడమే షర్మిల చేసిన అది పెద్దతప్పు అని విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్నారు. అన్నతో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే ఏదో ఒక రకంగా రాజకీయ పదవి లభించేదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. తెలంగాణలో పార్టీ పెట్టి షర్మిల చేతులు కాల్చుకున్న ట్లయిందని అనే వారు ఎక్కువగా కనపడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అభిమానించే వారంతా షర్మిల రాజకీయంగా వేసిన తప్పటడుగులు గురించి చర్చించుకుంటున్నారు.

రాజకీయంగా బలమైన కుటుంబం నుంచి వచ్చిన షర్మిల చివరకు నామ మాత్రంగా మిగిలిపోతుండటం జీర్ణించు కోలేక పోతున్నారు. ఆమె తెలంగాణలో వైఎస్సార్టీపీ పార్టీని పెట్టారు. అంతవరకూ బాగానే ఉంది. వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర కూడా చేశారు. పాలేరు నియోజవర్గంలో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. పాలేరులో పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. వైఎస్ ను అభిమానించే అనేక మంది షర్మిల వెంట నడిచారు. కొందరు బయటకు రాకపోయినా పరోక్షంగా షర్మిలకు సహకారం అందించాలని నిర్ణయించు కున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆమె వేసిన ఒకే ఒక స్టెప్ మొత్తం సీన్ ను మార్చేసింది. తాను తెలిసి ఈ అడుగు వేశారా? లేదా ఏదైనా ప్రయోజనం ఆశించి ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఏదో ఒకటి రెండుసీట్లయినా దక్కేవి. కానీ కాంగ్రెస్‌తో కలవడం వల్ల వైఎస్ అభిమానులను కూడా షర్మిల దూరం చేసుకున్నట్లయింది. జగన్ ను కేసుల్లో ఇరికించిన కాంగ్రెస్‌తో చేతులు కలపడాన్ని సొంత పార్టీ నేతలే వ్యతిరేకించారు. ఎవరికీ చెప్పకుండా తాను హడావిడిగా ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్ ను కలసి రావడం, బెంగళూరుకు వెళ్లి పదే పదే డీకే శివకుమార్ తో మంతనాలు జరపడం వైఎస్ ను అభిమానించే వేలాది మందికి రుచించలేదు. దీంతో షర్మిల ఇప్పుడు తెలంగాణలో ఒంటరి అయిపోయారన్న కామెంట్స్ బలంగా వినపడుతున్నాయి.

ఇటు సొంత సామాజికవర్గంతో పాటు వైఎస్ అభిమానులను కూడా షర్మిల తన నిర్ణయంతో దూరం చేసుకున్నట్లయింది. విలీన ప్రతిపాదన... పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తానని చేసిన ఆమె ప్రతిపాదన కూడా ఇప్పటి వరకూ అమలు కాలేదు. వైఎస్ వ్యతిరేక వర్గం తుమ్మల నాగేశ్వరరావును పార్టీలోకి తీసుకురావడంలో సక్సెస్ కావడంతో పాలేరు సీటు కూడా దక్కే అవకాశం లేదు. గత నెల 30వ తేదీ వరకూ షర్మిల కాంగ్రెస్‌కు డెడ్ లైన్ విధించారు. దానికి కూడా స్పందన లేదు. తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయింది. ఇప్పుడు షర్మిల ఒకే ఒక ఆప్షన్. తాను ఒంటరిగా పోటీ చేయడమే. తన పార్టీ అభ్యర్థులను పోటీ చేయించాల్సిన పరిస్థి?తి ఏర్పడింది. కాంగ్రెస్ హైకమాండ్ నుంచి ఇప్పటి వరకూ సానుకూల స్పందన రాకపోవడంతో ఇక షర్మిల ముందు మిగిలిన ఆప్షన్ ఒంటరిగా బరిలోకి దిగడం. లేదంటే తాను ఒక్కరే పోటీ చేయడం. మరొక ఆప్షన్ పోటీకి దూరంగా ఉండి ఎన్నికల అనంతరం కాంగ్రెస్ లో విలీనం చేయడం. మరి షర్మిల ఏం చేస్తారన్నది ఈ రోజు, రేపట్లో తెలియనుంది. 119 నియోజకవర్గాల్లో ఇప్పటికిప్పుడు అభ్యర్థులను ఖరారు చేయడం కూడా సాధ్యం కాని పని కావడంతో ఆమె ఒంటరిగానే బరిలోకి దిగుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి షర్మిల ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## మూడు విడతలుగా బస్సు యాత్ర

### 18,19,20 తేదీల్లో పాల్గొననున్న రాహుల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో మూడు విడత లుగా విజయభేరి బస్సుయాత్ర ఉంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి విడుతల్లో మూడు రోజులు బస్సు యాత్ర, దసరా తర్వాత రెండవ దశ బస్సు యాత్ర, నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత మూడవ దశ బస్సు యాత్ర ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే తొలి విడత బస్సు యాత్రలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొంటారు. 18న రామప్ప దేవాలయంలో శివుడికి పూజ చేసి బస్సు యాత్ర ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదే రోజు భూపాలపల్లిలో మహిళలతో సమావేశం,19న రామగుండంలో సింగరేణికార్మికులతో సమావేశం, పెద్దపల్లిలో పాదయాత్ర, సభ, కరీంనగర్‌లో పాదయాత్ర, సభ 20న జగిత్యాల, బోధన్, నిజామా బాద్‌లో పాదయాత్ర, సభలు ఉంటాయని రేవంత్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థి దశలో మరుపురాని జ్ఞాపకాలెన్నో

### - నల్సార్‌లా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ కృష్ణదేవరావు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** విద్యార్థి దశలో మరుపురాని జ్ఞాపకాలెన్నో ఉన్నాయనీ, వాటిని నెమరువేసుకునేందుకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అవకాశం కల్పించిందని నల్సార్ లా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కృష్ణదేవరావు అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 48 ఏండ్ల తర్వాత వారంతా ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాము ఉన్నతంగా ఎదగడానికి కారకులైన ఆనాటి ప్రధానోపాధ్యాయులు వరదారెడ్డి, ఉపాధ్యాయులు రాధాకిషన్, శాస్త్రి, కుమారస్వామి, సింగారెడ్డి, తదితర గురువులను పూలదండలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. తమ అనుభవాలను పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసి నేటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానం చేశారు. పూర్వ విద్యార్థులంతా తమ వయస్సుని సైతం లెక్కచేయకుండా వినోద కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కృష్ణదేవరావుతో పాటు ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ప్రముఖ వ్యాపారవేత్త సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వీర్యం దశలో ప్రభుత్వ రంగ సంస్థలు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం వేగతరమైందనీ, అదే సమయంలో కార్పొరేట్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వర్కు ఆర్డర్లు కూడా సరిగా ఇవ్వడం లేదని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోస్టల్ యూనియన్ ఆఫీసులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఆయా సంస్థల్లో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని విచ్చలవిడిగా అమలు చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాల అమలు విషయంలో వ్యత్యాసాలు న్నాయని చెప్పారు. రెన్యూవల్ విధానం ఆరునెలలకోసారి పెట్టి సర్వీస్ బ్రేక్ ఇవ్వడం అన్యాయమన్నారు. వేతనాల పెంపు, చట్టబద్ధ సౌకర్యాల కల్పన కోసం సమశీలంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ కార్యాచరణ ప్రణాళికను ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో బీడీఎల్, బీఈఎల్, మిధాని, బీపీసీఎల్, ఐఓసీఎల్, సింగరేణి నాలుగు యూనిట్లు, కిషన్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశం

### - మేనిఫెస్టో కమిటీ పరిశీలిస్తుందన్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

### - 'డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ' ప్రతినిధులు హామీ



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మేనిఫెస్టో కమిటీకి నివేదిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు జి.ప్రతాప్‌రెడ్డి, దండ రామకృష్ణ, సభ్యులు క్రాంతి తదితరులు ఆదివారం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని చేర్చాలని ఆయన్ను కోరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డీజేహెచ్‌ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు 300 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, జర్నలిస్టులు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వమే రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన జర్నలిస్టులకు నెలకు రూ. 10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రై వేటు విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి హెల్త్ స్కీం అమలు చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని రేవంత్‌రెడ్డిని కోరారు.

## బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోపై షర్మిల ఫైర్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు గుప్పించారు. "కొండంత రాగం తీసి పిల్లికూత కూసినట్లుంది కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో. పోయిన ఎన్నికలకు ఇచ్చిన హామీలే నెరవేర్చే దిక్కు లేదు. మళ్లీ కొత్త కథ మొదలు పెట్టింరు. బ్రతుకు మీద ఇవ్వాల్సిన ధీమా పక్కన పెట్టి పోయాక భీమా ఇస్తాడట. సున్నా వడ్డీకే రుణాలు అని మోసం చేసిన దొర. ప్రతి మహిళకు నెలకు రూ. 3 వేలు ఇస్తామనడం హాస్యాస్పదం. నిరుద్యోగ భృతి అని గత మేనిఫెస్టోలో పెట్టిన పథకానికే దిక్కులేదు కానీ..

ఇప్పుడు రూ. 3 వేలు ఇస్తామంటే నమ్మాలా?. విడతల వారీగా పెన్షన్ల పెంపు ఒక పెద్ద జోక్. రుణమాఫీపై దొర యూ టర్న్. ఉద్యోగాలు ఇవ్వలేక ఏనాడో చేతులెత్తేశారు. ఉన్న పథకాలను పాతర పెట్టి ఓట్ల కోసం కొత్త పథకాలు అంటూ డ్రామాలు తప్ప మరోటి లేదు. బందిపోట్ల సమితి మేనిఫెస్టో ఓట్ల కోసం తప్ప ప్రజల కోసం కాదు." అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కరెంటు తీగ తెగి పడి తండ్రీ కొడుకుల మృతి

**గజ్వేల్ - ప్రభాత సూర్యుడు:** పొలంలో తెగిపడిన కరెంటు తీగ.. తండ్రీ కొడుకుల ప్రాణాలను తీసింది. వారి వెంట వెళ్లిన పెంపుడు కుక్కనూ బలిగొంది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన కుమ్మరి కనకయ్య(52) ఉదయం 5 గంటల సమయంలో పొలానికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కనకయ్య కుమారుడు భాస్కర్(30), తన సోదరుడితో కలిసి పొలానికి వెళ్లి వెతికారు. ఈ క్రమంలో భాస్కర్ సైతం అరుపులు, కేకలు వేసి కింద పడిపోయాడు. దీనిని గమనించిన అతడి సోదరుడు.. వెంటనే వెళ్లి పక్క పొలాల వారితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయించి వచ్చాడు. అప్పటికే భాస్కర్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడితో పాటు వచ్చిన పెంపుడు కుక్క కూడా అచేతనంగా పడి ఉంది. సమీపంలోనే కనకయ్య పడిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పొలానికి కరెంటు సరఫరా చేసే సర్వీసు వైరు తెగి పడి తండ్రీకొడుకులు చనిపోయినట్టు గుర్తించారు. విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈ ఘటనా స్థలానికి చేరుకోగా, బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్ ఆర్డీవో ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. భాస్కర్ భార్యకు ఏదైనా ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తామని, నష్ట పరిహారం చెల్లించేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు.

**స్టార్టర్ షాక్ కొట్టి మరో రైతు మృతి..**

ములుగు జిల్లా మంగపేట మండలం బోరునర్సాపురం గ్రామానికి చెందిన దుర్గం సత్యం(50).. జబ్బోనిగూడెం శివారులో ఆదివారం పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లిన సత్యం.. మోటారు వేశాడు. కరెంటు సరఫరా కాక పోవడంతో.. స్టార్టర్ బాక్స్‌ను సరిచేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో చనిపోయాడు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215